# పాపం రాధ!



"రాధా! నాన్నగారు పిలుస్తున్నారు."

"వస్తున్నానమ్మా!" అంటూ టవల్‌తో ముఖం తుడుచుకుంటూ వచ్చింది రాధ.

"ఏరి అమ్మా? పరీక్షలు బాగా వ్రాసినట్టేనా?"

"బాగా వ్రాశాను నాన్నా, క్లాసు వస్తుందేమో అనుకుంటున్నాను" అంది తండ్రి కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ.

"మంచిదమ్మా" అన్నారు ఆప్యాయంగా కూతురు వైపు చూస్తూ గోపాలంగారు.

"అమ్మాయి ఎదిగింది." భర్తకి గుర్తు చేసింది సీతమ్మగారు.

"అయితే. తరవాత ఏం చెయ్యదల్చుకున్నావమ్మా?" అన్నారు కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ.

"ఏముంది; నాన్నా. ఎమ్. ఎస్సీ. చదవడమే."

"మంచిదే."

"అదేమిటండీ, మీరు మరీను! అన్నిటికీ మంచిదే అంటారు. అమ్మాయికి అప్పుడే ఇరవై ఏళ్లు ఒంటికి వచ్చాయి. ఇంకా ఏం చదివిస్తారు చదువు, చక్కగా ఓ సంబంధం చూసి ఓ ఇంటిదాన్ని చెయ్యక."

"ఏం చెయ్యమన్నావే అమ్మాయి ఇష్టపడకపోతే."

"దాని ఇష్టమేమిటండీ మధ్య? వయసొచ్చిన పిల్ల పెళ్లి చెయ్యమని అడుగుతుందా ఏం? దాని ఇష్టప్రకారం కానిస్తే ఇక అడిగినట్టే ఉంటుంది."

"అయితే అమ్మాయిని నువ్వే అడుగూ."

"ఇది మరీ బాగుందండీ! ఎదురుగా అమ్మాయిని పెట్టుకొని నన్నడుగుతారేమిటండీ, మీరు అడిగితే చెప్పదా ఏం?"

"అమ్మాయ్, వింటున్నావుగా మీ అమ్మ ఉద్దేశ్యం. ఇక నీ అభిప్రాయం చెప్పమ్మా" అన్నారు కూతురివైపు తిరిగి గోపాలంగారు.

"చెప్పు దానికేముంది, నాన్నా! నా కింకా చదువు కోవాలనుంది, చదువుకుంటాను. నే నిప్పుడిప్పుడే పెళ్లి చేసుకోను." ఖండితంగా చెప్పేసింది రాధ.

"అదేమిటే అలా అంటావు. ఉన్నవాళ్ళు మీ రిద్దరేనా! వాడు చాలా దూరంలో ఉన్నాడు. మేమా ముసలివాళ్లమైపోతున్నాము. నీకు ఆ మూడు ముళ్ళూ పడేసి, రామా, కృష్ణా అంటూ నిశ్చింతగా ఉందామను కుంటే నువ్వు చదువంటావు. అయినా ఆడదానికి చదువెందుకే? ఎంత చదివినా వంటపొయ్యేకదా? కాస్త పెద్దవాళ్ళమాట విను" అనునయించబోయింది.

"నే నిప్పటినించి పెళ్లి చేసుకోనమ్మా! పట్టుమని ఇరవయ్యేళ్లైనా నిండకుండా ఆ సంసారకూపంలో నేను పడలేను. నా చదువయ్యేదాకా నేను చేసుకోను."

చూశారా, చూశారా దాని మాటలు. నవ్వుతారేమిటండీ, మీరు మరీను. మీ రిచ్చిన కొమ్ముతో ఇవన్నీను. అంబోతులా తయారయింది. మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి, మధ్య నా మాటేమన్నా పడనిస్తారేమిటి?" అంటూ భర్తమీద విరుచుకు పడింది.

"నవ్వకపోతే ఏం చెయ్యమన్నావే?"

"ఏం చేస్తారో, ఏమో? రేపు వాళ్లకి ఏం సమాధానం చెప్తారో ఏమో."

"వాళ్లెవరమ్మా?"

సీతమ్మగారు మాట్లాడలేదు.

"ఏమీ లేదమ్మా. మొన్న మీ అమ్మ పేరంటానికి వెళ్లిందిట. అక్కడ ఎవరో ఒక సంబంధం చెప్పారుట.

---

డిగ్రీ చదువులు మగపిల్లలకి వరాలు, ఆడపిల్లలకి శాపాలు అవుతున్నాయి. చదువుల మోజులో పడి, అనుకూలమైన సంబంధాలు వచ్చినా, ప్రాణంకన్న మిన్నగా ప్రేమించి, ఆరాధించేవారు దొరికినా, ఆ అదృష్టాన్ని కాలదన్నుకునే వయసుమీరిన కన్నెల జీవితాలు ఎడారి బ్రతుకులే అవుతాయి ... వయసు తీరిన తర్వాత మనసు మారినా, విధి ఎదురునిలిస్తే, తమ కోరికలే తమను కాటువేస్తాయి.

---

ఆ సంబంధం తాలూకువారుకూడా పేరంటానికి వచ్చారట. వాళ్లు నిన్ను చూసుకోడానికి 'ఎప్పుడు రమ్మన్నారు' అని అడిగారట. ఏది నీకు పరీక్షలు ఇవాళదాకా అవలేదు కదా, నీకు పరీక్షలయ్యేదాకా నిన్ను డిస్టర్బ్ చెయ్యడం ఇష్టంలేక ఎందుకని ఊరు కున్నాను" అని అసలు విషయం చెప్పారు గోపాలంగారు.

"నాన్నా! దయచేసి వాళ్లని రావద్దని చెప్పెయ్యండి, నే నిప్పుడప్పుడే పెళ్లి చేసుకోను. నాకు చాలా ఆశయాలు లున్నాయి. పోనీ కనీసం నా ఎమ్. ఎస్సీ. అన్నా అయ్యేదాకా ఆ ఊసెత్తకండి" అంటూ చరచరా తన గదిలోకి వెళ్లి తలుపేసుకుంది రాధ.

"చూశారా, దాని పొగరు. పెద్దవాళ్ళం చెప్తాం, వినాలి కాని ఎలా విసురుగా వెళ్లిపోయిందో! దీని ప్రవర్తన నా కేం నచ్చలేదు. వాడికికూడా రెండు ముక్కలు రాసి పడేస్తాను. వాడికేనా లొంగుతుందేమో! మీ వల్లకాదు, మీ ముద్దులకూతురు మాటకి తాళం వేస్తారు" అని కోపమంతా భర్తమీదచూపి వంటింట్లో కెళ్లిపోయారు సీతమ్మగారు.

గోపాలంగారు ఓ నవ్వు నవ్వుకుని పేపర్లో తల దూర్చారు ఏమీ పట్టనట్టు.

* * *

"పోస్ట్!"

"రాధా! చూడు, మనకి ఉత్తరాలు వచ్చినట్టున్నాయి" వంటింట్లోంచి కేకేశారు సీతమ్మగారు.

"అన్నయ్య వ్రాశాడమ్మా" అంది రాధ కవరు చించుతూ.

"ఆఁ, అన్నయ్య వ్రాశాడా! చదువమ్మా, నా కిప్పుడు తీరికలేదు చదవడానికి. ఏం రాశాడో, వెట్టినాయన."

రాధ చదవడం మొదలెట్టగానే అన్నం కలుపుతున్న గరిటె చేత్తో పట్టుకుని చెవులు రిక్కించి వింటూ నిల్చున్నారు సీతమ్మగారు.

"మ. స. అమ్మకు,

సురేష్ నమస్కరించి వ్రాయునది. నీ ఉత్తరం అందింది. సంగతులు తెలిసినవి. నా శక్తికొద్దీ నే




## కుమారి వారణాశి సూర్యలక్ష్మి

ప్రయత్నిస్తానన్నా! చెల్లి పరీక్షలు బాగా వ్రాసిందను కుంటాను. సెలవులే కనక ఓ సారి పంపు. వాళ్ల వదినకి చూడాలని ఉందిట. నేను మరీ మరీ చెప్పమన్నా నని చెప్పు. 9 వ తారీఖు మంచిది. నేను స్టేషనుకి వచ్చి దింపుకుంటాను. బ్ర. శ్రీ. నాన్నగారు క్షేమం అని తలుస్తాను. నమస్కారాలని చెప్పు. చి. మీ కోడలు, మనుమరాలు క్షేమం. రమ, మామ్మా మామ్మా'! అని కలవరిస్తోంది. విశేషాలు లేవు.

సురేష్."

"ఏమిటమ్మా, శక్తి మేరకు ప్రయత్నిస్తా నంటున్నాడు?"

"ఆ, ఆ ఏం లేదు" అంటూ తన తడబాటును కప్పి పుచ్చుకుని, "ఏం లేదే, డబ్బు చాలడం లేదు. వీలైతే ఇంకొంచెం పంపమన్నాను, అంతే. అవును కాని, వాడు నిన్ను రమ్మని ఎన్నిసార్లు వ్రాశాడో చూశావా? ఈసారైనా వాడి మాట కాదనకు. వెళ్లి బట్టలు సర్దుకో, సెలవులేదాక వెళుదువుగాని."

"పోనిద్దమ్మా, ఇప్పుడెందుకే అక్కడికి. వచ్చే

## ఆ జన్మం ఋణపడ్డాం!

ఘనవిజయం ఘనవిజయం!
ఘన శశాంక తలముపైని
కాలూనిన ఘనవిజయం!
తొలిమానవ పాదముద్ర
చెరగకుండ లక్షల వ
త్సరముల పర్యంతం శశి
పై నిల్చే చిహ్నమంట!
మానవ ధీ చిహ్నమంట!
చంద్రుడేడ? భూమి యేడ?
ఇంద్రజాల మేమోయని
సందేహము కలుగునట్లు
మందస్మిత వదనముతో
"ఈగిల్" ద్వారమ్ము తెరచి
రాగరహిత సోమగామి
భద్రముగా చంద్రతలము
పాదాంకిత మొనరించిన
క్షణము భూ చరిత్రలో ని
లక్షణ మైనట్టి క్షణము;
పునరావృత్తము కాని ఆ
పూర్వమైన మొదటి క్షణము.
రోదసీ మహాసాగర
ఘోరశక్తి భంగముల ఆ
రించు చుండ భూమి వాసి
రించిన ఆయనావరణం
చెంత ప్రమాదకరంబో
మంతైన నెరుంగము కద!
వాయురహిత, వారి రహిత,
వనజరహిత, ప్రాణిరహిత
చంద్రునిపై పాద మిడుట
సాహసాతి సాహసమ్ము.
జ్ఞానార్జన చేయుటకై
ప్రాణాలను పణమొడ్డిన
ఆకాశ విహారులౌచు
ఆ శశాంకు చుంబించిన
ఆర్మ్‌స్ట్రాంగ్ ఆల్డ్రిన్ కాలిన్స్
కా జన్మము ఋణ పడ్డాం!

– వసంతరావు వేంకటరావు

ఏడాదికి ప్రిపేరన్నా అవచ్చు ఇక్కడుంటే. నే వెళ్లను లేద్దూ."

"ఆదేమిటే అలా అంటావు. వాడు ఎంతో ఆపేక్షతో రమ్మని రాస్తే వెళ్లనంటావు. పెద్దవాడు కదా, ఆ పాటి గౌరవం లేకపోతే ఎలా? పిచ్చి పిచ్చి వేషాలు మానేసి బయలుదేరు."

"చూద్దాంలే" అంటూ వెళ్లిపోయింది రాధ.

"ఏం పిల్లో, ఏమో! చెప్పినమాట అసలు వినదు."

"ఎవరే! చెప్పినమాట వినదంటున్నావు" అంటూ కూరల సంచీతో ప్రవేశించారు గోపాలంగారు.

"ఇంకెవరున్నారు? మీ సుపుత్రికా రత్నం" అంది కూతురిగొడవ కోపం భర్తమీద చూపిస్తూ.

"అసలు విషయం ఏమిటే?"

"ఏముంది? మీ అబ్బాయి సెలవు లేదాక, రాధని రమ్మని రాశాడు, ఇదేమో వెళ్ళనంటూంది. మీరేనా చెబుదురూ వెళ్లమని. వాడి దగ్గిర ఉంటే ఏమైనా మారుతుందేమో."

"అలాగే! చెబుతాలే" అని కండువా దులుపుకుంటూ హాల్లోకి వెళ్లిపోయారు.

• • •

తల్లీ తండ్రీ బలవంతంమీద ఎలాగో బయలుదేరింది రాధ అన్నగారి ఊరికి. బెజవాడ చేరేసరికి బాగా ఎండెక్కింది. కంపార్టుమెంటులోనించి తల ఇవతలకు పెట్టి నలుమూలలా వెదుకుతూంది రాధ. ఇంతలో నవ్వుతూ చెయ్యి ఊపుతూ సురేష్ వచ్చాడు. సామానంతా దింపించి, టాక్సీ మాట్లాడి రాధను తీసుకొని బయలుదేరాడు సురేష్, ఇంటికి. కారులో వారిద్దరి సంభాషణ అయ్యేసరికి ఇల్లు వచ్చేసింది.

గుమ్మంలోనే ఎదురయ్యింది వదిన జానకి.

"ఏమమ్మా, రాధా! బాగున్నావా? పరీక్షలు బాగా వ్రాశావా? అత్తగారు, మామగారూ క్షేమమా? ఏమిటమ్మా అదంతా చదువే! అలా చిక్కిపోయావు" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

"ఉండు, జానకీ! మా చెల్లిని ఊపిరి తీసుకోనిస్తావా? లేదా? తరవాత అడగవచ్చునులే అవన్నీ. ముందు స్నానానికీ, భోజనానికి ఏర్పాట్లు చెయ్యి, మా చెల్లి చాలా అలిసిపోయింది" అన్నాడు సురేష్.

"అబ్బ, చెల్లిమీద ఎంత ప్రేమ వచ్చిందమ్మా" అని నవ్వుకుంటూ లోనికి దారి తీయబోయింది. కాని, పైటచెంగట్టుకున్న రమ కదలనివ్వలేదు.

"అమ్మా! అత్తే కదే, ఒత్తింది మనింటికి" అంది చాటునుంచి.

"ఏమే రమా అలా మీ అమ్మనార దాక్కుంటావు? నేను మీ అత్తనే లే! ఇలా రా" అంటూ బొద్దుగా, ముద్దుగా ఉన్న అయిదేళ్ల రమను ఎత్తుకుని లోనికి దారి తీసింది రాధ.

భోజనం అయిన తరవాత ఓ గంట పిచ్చాపాటీ వేసి, బడలికగా ఉండడంచేత నడుం వాల్చింది రాధ. పడుకున్నదే తడవుగా నిద్ర ముంచుకు వచ్చేసింది. మెలుకువ వచ్చేసరికి సాయంత్రం నాలుగు గంటలయింది. ముఖం కడుక్కుని, జడ వేసుకునేసరికి జానకి టిఫినూ, కాఫీ తెచ్చింది.

"ఏమ్మా, రాధా! మాకు బూర్లెప్పుడు పెడతావు?" అంది జానకి.

"తిందువుగానిలే, వదినా! అప్పుడే తొందరేమిటి?" అంటూ టిఫిన్ తినడం మొదలుపెట్టింది.

"తొందర కాక ఏమిటమ్మా! ఆడపిల్లంటే మాటలా మరి."

"ఏమిటో వదినా, మీ చాదస్తాలు మీరూను. ఆడపిల్లంటే అంత బరువుగా ఉంటుందా? అక్కడ అమ్మ బాధ పడలేక ఇక్కడికి వస్తే నువ్వు మొదలెట్టావ్. ఇలా అయితే నే నిక్కడ ఒక్క నిమిషం ఉండను, వెంటనే రైలెక్కేస్తా."

"ఆ పని మాత్రం చెయ్యకు, రాధా? నేను ఏ ఊసెత్తనులే. కాని ఈ ఏడు కా ముచ్చట అంటారు. ఎదిగిన పిల్లలుంటే గుండెలమీద కుంపటిలా ఉంటుంది. ఆఁ, వస్తానుండు అరటల ముక్కలు మాడిపోతాయి. అంటూ ఖాళీచేసిన గ్లాసూ, ప్లేటూ తీసుకొని వెళ్లిపోయింది జానకి.

'పిచ్చి వదిన' అనుకుంది రాధ.

అలా పక్కకు చూసేసరికి అందంగా గుడ్డ కప్పబడిఉన్న జానకి వీణ కంటపడ్డాది. వెంటనే ఉత్సాహంగా వెళ్లి వీణను తెచ్చుకొని, తీగలు సరిచేసి, తనకి ప్రియాతిప్రియమైన మోహనవర్ణం వాయించడం మొదలెట్టింది. అలా వాయిస్తూ...వాయిస్తూ...వెనక్కి తిరిగింది. తక్కున ఆగిపోయింది వాయిద్యం, అపరిచిత వ్యక్తిని చూసి.

"అక్కా, ఏమిటివాళ సుదినం? వీణ వాయిస్తున్నావ్" అంటూ వచ్చి ఆగిపోయాడు ఒక యువకుడు. క్షణం ఆ యువకునివైపు చిత్తరపోయి చూసింది రాధ. ఆ యువకునికి దాదాపు పాతికేళ్ళుంటాయి. నిండైన విగ్రహం. జానకి స్థానంలో రాధను చూచిన అతను, వచ్చినంత వేగంగానే వెళ్లిపోయాడు వంటింట్లోకి. అక్కడ జానకి నేదో అడుగుతున్నట్లున్నాడు. రాధమట్టుకు కదలకుండా అలాగే స్థాణువులా కూర్చుండి పోయింది.

"రాధా!" అంటూ వదిన ఆ నూతన యువకుణ్ణి వెంటపెట్టుకుని వచ్చింది గదిలోకి.

తడబడుతూ లేచి నిలబడింది రాధ.

"ఇతను, మా పినతల్లి కొడుకు...వరసకి తమ్ముడు. పేరు మాధవ్. ఇక్కడ ఏదో కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఐదు వందలు జీతం. ఈమె మా మరదలు బియస్సీ పరీక్షలు మొన్ననే రాసింది" అని పరస్పరం పరిచయం చేసింది జానకి.

తెలియకుండానే చేతులు జోడించింది రాధ. అతనూ ప్రతినమస్కారం చేశాడు.

"మీ రిద్దరూ మాట్లాడుతూ ఉండండి. ఇప్పుడే వస్తా" అంటూ జానకి వెళ్లిపోయింది.

అయోమయావస్థలో పడ్డది రాధ, కొత్త వ్యక్తితో ఎలా మాట్లాడాలో తెలియక. తన్ను తాను నిలదొక్కుకుని. "కూర్చోండి" అంది కుర్చీ చూపి. అతను కూర్చున్నాక తానుకూడా కూర్చుంది మంచంమీద. అలా మౌనంగా ఉండిపోయా రిద్దరూ—చాలాసేపు ఏం మాట్లాడాలో తెలియక.

"హలో, మాధవ్! ఎప్పుడు వచ్చావు? ఏమిటలా బొమ్మల్లా కూర్చున్నా రిద్దరూ? ఐ యామ్ సారీ, ఆమె నీకు తెలియదు కదూ! మా చెల్లెలు రాధ" పరిచయం చెయ్యబోయాడు సురేష్.

"నేను పరిచయం చేశానులెండి; మహా పెద్ద పరిచయం చేసేస్తున్నారు మా చెల్లెల్ని" అంటూ అక్కడికి వచ్చింది జానకి.

రాధ అడ్డంగా ఉన్న వీణను తియ్యబోతూంటే... "అదేం కుదరదు, రాధా! మా మాధవ్‌కి వీణ చాలా ఇష్టం, ఒక్కసారి వాయించు వింటాడు. ఏం మాధవ్?

మాధవ్ నవ్వి ఊరుకున్నాడు.

రాధ అడ్డంగా తల తిప్పింది అయిష్టతను తెలియ పరుస్తూ.

సురేష్ మట్టుకు ఊరుకోలేదు "మా రాధ మీ అక్కయ్యకన్నా బాగా వాయిస్తుందోయ్ వీణ! ఏది రాధా, ఒక్కసారి మీ వదిన ఉడుక్కునేలా వాయించు" అంటూ ప్రోత్సహించాడు సురేష్.

"ఏది ఒక్కసారి వాయించండి, రాధాదేవిగారు, మీ అన్నయ్యగారు అంత పొగిడేస్తున్నారు" అన్నాడు మాధవ్ అక్కగారి వైపు చూస్తూ.



గాలి గుఱ్ఱాలు

చిత్రం—ఎ. వి. ఎస్. ఆర్. జోస్యులు (గుంటూరు)

ఇక తప్పిందికాదు రాధకి. రెండు కృతులు వాయించింది. అలా అలా అర డజను కృతులవరకూ వాయించమన్నారు శ్రోతలు ముగ్గురూ. నిజంగా చాలా బాగా వాయించింది రాధ.

"ఐ యామ్ వెరీ హాపీ మిస్ రాధాదేవీ, మా అక్కకన్నా మీరే బాగా వాయించారని ఒప్పుకోక తప్పదు." అని మనస్ఫూర్తిగా మెచ్చుకున్నాడు మాధవ్.

"థాంక్స్" అంది రాధ.

"మరేమిటనుకున్నావోయ్ మా సిస్టరంటే, మీ అక్క కాదుగా" అంటూ ఓరగా జానకివైపు చూశాడు సురేష్.

జానకి మూతి తిప్పింది ఒయ్యారంగా.

నలుగురూ నవ్వుకున్నారు హాయిగా.

ఓ ఆదివారంనాడు మధ్యాహ్నం మాధవ్ వచ్చి, "అక్కాయ్, ఈ రోజు మీ రందరూ మా ఇంటికి రావాలి. నువ్వు చూసిందే అయినా రాధాదేవిగారు చూస్తారు" అంటూ ఆహ్వానించాడు.

"నా దేంలేదు తమ్ముడూ, మీ బావగారిష్టమే" అంటూ భర్తవైపు తిరిగింది.

"అదేమిటి, జానకీ! అలా అంటున్నావు, నే నేమన్నా వద్దన్నానా, మీ తమ్ముడంత ఆప్యాయంగా పిలుస్తుంటే నా ఇష్టం అంటావు? నాకీ రోజు ఆఫీసులో కొంచెం వర్కుంది. నేను రాలేను. రాధను తీసుకొని వెళ్ళు" అన్నాడు సురేష్.

నెల్లాళ్ళ అన్నగారింట్లో ఉంటున్న రాధకు మాధవ్‌తో పరిచయం బాగా పెరిగింది. ఆ నాటి అతని ఆహ్వానాన్ని తిరస్కరించలేక వదినగారివెంట బయలుదేరింది.

మాధవ్ ఇల్లు చిన్నసైజు బంగళాలా ఉంది. అతను, అతని తల్లీ తప్ప మరెవరూ లేరు. మాధవ్ తల్లి ఆప్యాయంగా పలకరించింది. జానకి రాధను ఆవిడకు పరిచయం చేసింది. కాఫీ, టిఫిన్లయ్యాక జానకి ఆవిడతో బాతాఖానీ మొదలెట్టింది. రాధకి ఏమీ తోచక ఇంటి చుట్టూ ఉన్న తోటను, అక్కడి మొక్కలను పరిశీలిస్తూ నిల్చుంది. మాధవ్ వచ్చి ఆమె పక్కగా నిల్చున్నాడు.

చిన్నగా నవ్వి, "ఏమండీ, మీ మిసెస్ ఏదీ, చూపరా ఏం?" అంది రాధ.

అతను నవ్వి, "నా కింకా మారేజ్ కాలేదండీ" అన్నాడు.

రాధ నాలిక కరచుకుని తల దించుకుంది.

"అలా తోటలోకి వెళ్దాం రండి" అని ముందుకు దారి తీశాడు. చేసేదిలేక మౌనంగా అతన్ని అనుసరించింది రాధ.

తోటంతా తిప్పి చూపి సంపెంగ చెట్టువద్ద ఆగి, "ఇక్కడ చల్లగా ఉంటుంది, ఒక్క అయిదు నిమిషాలు కూర్చుందాం" అంటూ చతికిలబడ్డాడు మాధవ్ రుమాలు పరుచుకొని.

అతనికి కొంచెం దూరంలో, ఎదురుగా కూర్చుంది రాధ.

సూర్యుడు పశ్చిమాద్రిని చేరుకుంటున్నాడు. నీరెండ వింతకాంతుల్ని ప్రసరింపచేస్తూంది. సంపెంగ చెట్టు కొమ్మలు ఒయ్యారంగా తల లూపుతున్నాయి. విచ్చుకున్న పువ్వులు, విచ్చుకుంటున్న పువ్వుల సువాసన మనస్సును ఆహ్లాదపరుస్తూంది.

గులాబీరంగుచీర, నీలం చోళీ వేసుకున్న రాధ మోకాళ్ళ మీద తల ఆన్చి, అరమోడ్పు కన్నులతో పరిసరాలను పరికిస్తూ కూర్చుంది. ఆమెవైపే ముగ్ధుడై చూస్తూ కూర్చున్నాడు మాధవ్.

ఒక అయిదు నిమిషాల అనంతరం మాధవ్ తన తల్లి తనపై చూపే ప్రేమ, ఆ ఊరిలోని విశేషాలు చెప్పడం మొదలెట్టాడు. అతను చెప్పిందంతా శ్రద్ధగా వింది రాధ.

"ఏమండీ! నా దొక్క సందేహం. ఇంత చక్కని ఇల్లు, అంత ఆప్యాయత చూపే తల్లీ, చక్కటి ఉద్యోగం .. ఇన్ని అవకాశాలున్న మీరు వివాహం ఎందుకు చేసుకోలేదు?"

"బాగుందండీ! ఎన్నున్నా నాకు నచ్చిన కన్య దొరకవద్దా? నేనో ప్రశ్న మిమ్మల్ని అడగాలనుకుంటున్నాను. అడగమన్నారా?" నవ్వుతూ అడిగాడు.

"అడగండి" అంది సంభ్రమంగా.

"వివాహంపై మీ అభిప్రాయమేమిటండీ?"

"వివాహవిషయంలో నాది చాలా విచిత్రమైన అభిప్రాయమండి. బహుశా అందరూ నాలా భావించరేమో! మన పెద్దలు చెబుతారు చూడండి...వివాహం నూరేళ్ల పంట అని, అది శుద్ధ అబద్ధమండీ. ఈ కాలంలో అయితే మన ఇష్టప్రకారమే జరిపిస్తున్నార్ట కాని, పూర్వం యువతీ యువకులు చాలా దురదృష్ట

వంతులని నా భావం. కారణమేమిటంటే బాల్యవివాహాలు. ఆడపిల్లకి పదేళ్ళన్నా నిండకముందేనా? దాని మెడ కో ఉరితాడు బిగించి, ఇంకా పసితనం తొలగకముందే పెళ్ళి జీవితం పెద్ద కష్టాలతోనే, ఆ సంసారసాగరం, భర్తతోనూ పిల్లలతోనూ, కుటిలలో పడ్డ ఎలకలాగ కొట్టుకుంటూ ఈదమనే వారు — పెళ్ళనే పేరుతో! అది ఎంతో సుఖం అంటారు కాని, నాకు సుఖం ఏమిటో అర్థం అవలేదు. పైపెచ్చు యమ నరకంలా ఉంటుంది. ఇది మగాళ్ళకన్నా ఆడవాళ్లకే హెచ్చుగా ఉంటుంది. మీరు చూడండి. వంటికి పాతికేళ్ళన్నా రాందే ఏ యువతీ వివాహానికి ఇష్టపడటం లేదు. కారణం నే పైన చెప్పినది. ఈ పాతికేళ్ల జీవితంలో అనుభవించవలసిన ఆనందం అనుభవించి, జాలీగా లైఫ్ లీడ్ చెయ్యాలి. ఆ తరవాత వాళ్ళ ఇష్టప్రకారం వివాహం చేసుకొని స్థిరపడుతున్నారు. నాకు మా ఇంట్లో పదిహేను సంవత్సరాలనుంచి వివాహప్రయత్నాలు జరుగుతున్నాయి. మా అమ్మ పట్టుదలతో కూర్చుంది నా వివాహం చేసెయ్యాలని. కాని, నా ఇష్టంలేనిదే ఏ పనీ చెయ్యరు. ఒక్క కూతుర్ని అవడంచేత నా మాట నెగ్గుతున్నది. నాకు కొన్ని ఆశయాలున్నాయి. అవి నెరవేరేదాకా వివాహ ప్రయత్నం మానమని చెప్పేశాను. చేసినా విఫలమే కాని, సఫలం అవదు." అంటూ తన అభిప్రాయాన్ని చెప్పింది రాధ.

ఆసక్తిగా వింటూ కూర్చున్నాడు మాధవ్.

చాలాసేపు ఇద్దరూ మౌనంగానే ఉండిపోయారు.

"నేనంటే మీ కేలాటి అభిప్రాయమో చెప్పగలరా?" హఠాత్తుగా ప్రశ్నించేడు మాధవ్.

"బాగుందండీ, మీపైన నా అభిప్రాయం ఏమిటి? అయినా ఈ నెల్లాళ్ల పరిచయంలో నేను గ్రహించింది మీ సహృదయత, స్నేహశీలత గొప్పవని."

"థాంక్స్. కాని నా దొకటే కోరిక. మీ కభ్యంతరం లేపోతే మిమ్మల్ని నా దాన్నిగా చేసుకుంటాను. ఇప్పుడప్పుడే కాదులెండి, మీ ఆశయాలు నెరవేరింతరవాత. ఎంత కాలమైనా ఫరవాలేదు, నేను మీ కోసం ఎదురు చూస్తాను. నేను మిమ్మల్ని పూర్తిగా అర్థం చేసుకొన్నాను. మీ ఆశయాలు గౌరవిస్తాను. మీ కిష్టమైతేనే...ఏమంటారు?"

ఆశ్చర్యచకితురాలై పోయింది రాధ, ఆ ప్రశ్న విని. అంతలోనే తన్ను తాను సమాధానపర్చుకొని,

"నా కోసం మీరాగడం అంత సమంజసంగా ఉండదేమో! అయినా నా కోసం మీరు ఆగడమేమిటి? నా బుద్ధి పుడితే చేసుకుంటాను. లేకపోతే ఆజన్మాంతం ఇలాగే ఉండిపోతాను. మీ జీవితాన్ని నా జీవితంతో ముడి పెట్టుకోకండి. అది అంత శ్రేయస్కరం కాదేమో! మీకు తగిన కన్యను వెతికి మీరు చేసుకోండి. మరోలా అనుకోకండి, నన్నపార్థం చేసుకోకండి" అంది తడబడుతూ.

"ప్లీజ్ మీరు మరోలా భావించకండి. ఇందులో నా స్వార్థం చాలా ఉంది. ఎంతకాలమైనా ఫరవాలేదు, మీరే నాకు కావాలి. కాదనకండి. ప్లీజ్...మీరు 'ఊ' అనండి చాలు, నేను ఎంతకాలమైనా ఆనందంగా మీ కోసం నిరీక్షిస్తాను" అన్నాడు ప్రాధేయపడుతూ.

కొంతసేపాలోచించి, "సరే, ఆలోచించి చెబుతా" అంటూ లేచింది రాధ.

"మీ ఇష్టం" అంటూ అతను లేచాడు.

ఇంతలో రమ నెత్తుకుని అటుగా వస్తూ, "రాధా నువ్విక్కడున్నావా? అరే, మాధవ్! నువ్వుకూడా ఉన్నావా? మా రాధకి మా తోటంతా చూపిస్తున్నావా ఏమిటి?" అంది.

రాధ నవ్వి ఊరుకుంది. మాధవ్ తన మొహంలోని భావాలు కప్పిపుచ్చుకుంటూ, "అవునక్కాయ్" అన్నాడు.

"ఎలా ఉంది రాధా, మా తమ్ముడిల్లు?"

"చాలా బాగుంది, వదినా."

"సరే, పద పద. మసక వచ్చి చాలా సేపయింది. మీ అన్నయ్య వచ్చేసి మన కోసం ఎదురు చూస్తుంటారు." అంటూ తొందర చేసింది.

"వస్తాం, పిన్నీ" అని శాంతమ్మగారితో చెప్పి జానకి బయలుదేరింది. రాధకూడా శాంతమ్మగారి వద్ద, మాధవ్ వద్ద సెలవు తీసుకొని వదిన వెనకే నడిచింది.

మాధవ్ వారిని రిక్షా ఎక్కించి, పాత స్మృతులు తల్చుకుంటూ ఇంట్లో అడుగు పెట్టాడు.

* * *

తెల్లవారీ తెల్లవారకముందే పేపరుతో సహా వచ్చాడు మాధవ్, దబదబా తలుపు బాదుతుంటూ. అప్పుడే మెలకువ వచ్చిన రాధ తలుపు తీసింది. ఎదురుగా పేపరు కనిపించేసరికి ఆమె ముఖం ఒక్కసారి వెలిగింది.

"ఏమండీ, రాధాదేవిగారూ! మీ రిజల్ట్సు వచ్చేశాయ్, మీ నంబరు చెప్పండి చూస్తా" అన్నాడు ఆత్రతగా.

రాధ నంబరు చెప్పింది.

ఒక నిమిషం పేపరంతా వెతికి ఒక్క గంతేశాడు.

"రాధాదేవిగారూ, ఫస్ట్ క్లాస్ వచ్చింది. కంగ్రాచులేషన్స్" అంటూ ఉత్సాహంగా చెయ్యి అందించబోయాడు. అంతలోనే తమాయించుకొని, "సారీ" అన్నాడు. రాధ తల వంచుకొని నిలబడింది.

ఇంతలో సురేష్, జానకీకూడా అక్కడకు వచ్చారు.

"ఏమిటోయ్, ఇంత పొద్దున్నే? ఓహో పేపరు వచ్చిందా? రిజల్ట్సు వచ్చాయన్నమాట! మా రాధకి ఫస్ట్‌క్లాసేనా?" అంటూ నింపాదిగా ప్రశ్నించాడు సురేష్.

"ఏమిటబ్బా ఆ నింపాది? మా చెల్లికేం క్లాసు రాలేదు సరికదా, పరీక్ష పోయింది" అన్నాడు మాధవ్ ఉడికిస్తున్న ధోరణిలో.

"షావోయ్ చెప్పేవు, ఏది ఇలా ఇయ్యి చూపిస్తా! అసలు నీకు పేపరు చూడ్డం వచ్చి ఉండదు!" అంటూ చేతిలోని పేపరు లాక్కుని చూశాడు.

"ఏమనుకుంటారు కాని, పార్టీ ఎప్పుడో చెప్పండి" అన్నాడు ఎప్పటిలా మాధవ్.

"అమ్మయ్యా! ఇవాళ నీ కిక్కడే డిన్నరు. మా రాధ ఫస్ట్‌క్లాసులో పాసయ్యిందిగా" అన్నది జానకి.

"ఓ.కే. అక్కగారూ, మీ ఆజ్ఞమీదగిందా ఈ సోదరుడు" అన్నాడు నాటక ఫక్కీలో.

అందరూ గట్టిగా నవ్వేశారు మాటలకి.

ఆ శుభసమయంలో సురేష్ ఒక మంచి వెంకటగిరి చీర ప్రెజెంట్ చేశాడు రాధకి. మాధవ్ ఒక గోల్డ్ రింగ్ ప్రజెంట్ చేశాడు—తన జ్ఞాపకార్థంగా. రిజల్ట్సు వచ్చాక మరి అన్నగారింట్లో ఉండబుద్ధి పుట్టలేదు రాధకి. మరో నాలుగు రోజులు అన్నగారి బలవంతం మీద అక్కడ గడిపేసి, బయలుదేరింది తల్లిదండ్రుల దగ్గిరికి. రాధ వెళ్ళేరోజున మాధవ్‌కూడా వచ్చాడు రైలుస్టేషన్‌కి. రైలు వచ్చేదాకా ముగ్గురూ మౌనంగానే ఉండిపోయారు. రైలు బయలుదేరాక కన్నీళ్లతో సాగనంపాడు సురేష్; మౌనంగా కళ్లతోనే సెలవు తీసుకున్నాడు మాధవ్.

* * *

కాలచక్రం దొర్లిపోతూంది. ప్రకృతిలో అనేక రకాల మార్పులు వస్తున్నాయి. ఈ లోపునే మరో పది వసంతాలు గడిచిపోయాయి. రాధ ఎమ్. ఎస్సీ డిగ్రీ పొందింది—ఫస్ట్‌క్లాసుతో. కాని, దురదృష్టవంతురాలు తల్లిదండ్రుల్ని కోల్పోయింది. కూతురి పెళ్లి బెంగతోనే చచ్చిపోయింది సీతమ్మగారు. తల్లిదండ్రులు పోయాకేనా రాధ నిర్ణయం మారలేదు. ఉద్యోగం చేస్తానని బయలుదేరింది. ఆఖరికి లెక్చరర్‌గా స్థిరపడిపోయింది విశాఖలో.

రాస్తున్న లెటర్ పూర్తిచేసి కవరులో పెట్టి, పనిపిల్లకిచ్చింది పోస్టు చేసిరమ్మని, రాధ. ఒళ్ళు విరుచుకుంటూ ఒక్కసారి అద్దంలో చూసుకుంది తన ప్రతిబింబాన్ని. ఉలిక్కిపడింది రాధ. రోజూ చూసుకునే ముఖమే అయినా ఈరోజు కొత్తగా కనిపించింది. పూర్వపు తన లావణ్యం ఎక్కడికి పోయిందో! కాని, ముఖం గంభీరమైన ముఖంలా తయారయ్యింది, ముడతలతో. తల అక్కడక్కడ నెరిసింది. ఒక్కసారి తన వయస్సు తలుచుకుంది. ముప్పైయారు సంవత్సరాలు. . . ఒక్క నిట్టూర్పు విడిచింది రాధ. మాధవ్ ఇప్పుడు తన్ను చూస్తే ఇష్టపడతాడా? పిచ్చివాడు! ఆ ఇష్టమైన్న రాధవే

---

## ఏమిటది?

### మసూనా

అంతుతెలియనట్టి ఆ ఆకాశం ఏమిటి?
లోతెరుంగనట్టి ఈ సాగరం ఏమిటి?

భూమి ఎవరు? చంద్రు డెవరు?
సూర్యు డెవరు? చుక్క లెవరు?

గాలి ఎటునుండి వచ్చు?
అగ్ని ఎటుల పుట్టుచుండు?

కదలలేని మెదలలేని
చెట్టుచెట్టున తిండి ఎట్లు?

గింజలోన గుడ్డులోన
జీవ మెట్లు అణగియుండు?

పగలు ఏల? రాత్రి ఏల?
పెరుగు టేల? తరుగు టేల?

ప్రకృతి రమ్యమైన తల్లి
చిత్రకథల కల్పవల్లి ★

## ఆగస్ట్ విశేషాలు

జనవరినుంచి ఎనిమిదవ నెల పేరు ఆగస్ట్. రోమన్ సంవత్సరంలో అది ఆరవ నెలగా ఉండటంచేత దానికి సెక్స్‌టిలిస్ అనే పేరు ఉండేది. కాని. జూలియస్ సీజర్ చేసిన సంస్కరణల ఫలితంగా సెక్స్‌టిలిస్ ఎనిమిదవ నెల అయింది. అందుచేత ఆ పేరు మార్చవలసి వచ్చింది. సీజర్ గౌరవార్థం ఒక నెలకు అతని పేరు పెట్టడం జరిగింది. అదే జులై నెల. మరొక రోమన్ సామ్రాజ్యాధీశుడు. సీజర్‌కు మేనల్లుడు అయిన ఆగస్టస్‌కు ఒక నెల నెన్నుకోమంటూ ఒక అవకాశం యిచ్చారు. జులైనెల తరవాత పుట్టే నెలను ఎన్నుకోవటంవల్ల ఎనిమిదవ నెలకు ఆ విధంగా ఆగస్ట్ పేరు పుట్టింది. ఆ కాలంలో ఆ నెలకు 30 రోజులే ఉండేవి. కాని, జులైనెలతో సమానంచేసే భావంతో ఆగస్ట్‌నెలకు కూడా ఒక రోజు పెంచి, ఫిబ్రవరినెల రోజుల్ని తగ్గించారు.

ఇంచుమించు ప్రపంచంలో ఈ నెలలో జాతీయ దినోత్సవాలు చేసుకునే దేశం మనదేనని చెప్పాలి. మన స్వాతంత్ర్య దినోత్సవానికి నోచుకున్న ఈ ఆగస్ట్‌నెల గొప్పదనం గురించి కొంత ముచ్చటించుకుందాము.

1769 ఆగస్ట్ 15 నెపోలియన్ బోనపార్ట్, 1771 ఆగస్ట్ 15 సర్ వాల్టర్ స్కాట్‌ల పుట్టిన రోజు. 1502 ఆగస్ట్ 1 న అమెరికా ఖండంలో కొలంబస్ మొట్టమొదటగా కాలుపెట్టాడు. 1914 ఆగస్ట్ 1 న రష్యామీద యుద్ధం ప్రకటించింది జర్మనీ. అదే సంవత్సరంలో ఆగస్ట్ 4 న జర్మనీపై యుద్ధం ప్రకటించాయి గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు

— మధుమూర్తి

అనుకుంటూ ఉన్నాడు కాబోలు! ఎందుకో ఆ నిరీక్షణ తన కోసం? ఎంతచెప్పినా వినడు. ఆనందంగా గడపవలసిన అతని జీవితాన్ని తన జీవితంతో ముడిపెట్టుకుని కూర్చున్నాడు. ఏవేవే రాస్తుంటాడు ఉత్తరాల్లో. . . ప్చ్. . . తను మరీ శిక్షిస్తూంది అతన్ని. ఈ వార్త విని ఎంతో సంతోషిస్తాడో... 'అమ్మమ్మ తాతయ్యల పెళ్లి' నవ్వుకుంది. ఇలాగ సాగిపోతున్నాయి రాధ ఆలోచనలు. ఉలిక్కిపడి వాచీ చూసుకొంది. తొమ్మిదిన్నర. తనకి అరగంట మాత్రమే ఉంది టైము. గబగబా కంచం వాల్చుకుని కూర్చుంది భోజనానికి. భోజనమయ్యాక చీర మార్చుకుని బయలుదేరింది కాలేజీకి.

ఫస్టవర్ ఖాళీ. సెకండవరు ఏదో డిగ్రీ క్లాసుంది. లాబ్‌లో అరేంజిమెంట్సు చూస్తూ కూర్చుంది ఒక అయిదు నిమిషాలు. ఏదో ఆలోచన తట్టి బర్నరంటించింది రాధ. ఇంతలో అటెండర్ ఒక ఎక్స్‌ప్రెస్ డెలివరీ లెటర్ పట్టుకొచ్చాడు. అటు తిరిగి అతని చేతిలోని లెటర్ పుచ్చుకుని విప్పి చదవ నారంభించింది, అటెండర్ వెళ్లిపోయాక.

"రాధా! ఘోరం జరిగిపోయింది. కారు యాక్సిడెంట్‌లో మాధవ్ మరణించాడు నిన్న. నాలుగు రోజులు సెలవుపెట్టేరా. చనిపోతూ నీ పేరే తలిచాడు: రాధా, రాధా అంటూ. పాపం. చాలా విచారకరమైన వార్తకదూ!

సురేష్."

అంతే...ఉన్నపాటునే కూలబడిపోయింది స్పృహ తప్పి రాధ. గమనించనేలేదు, ఎప్పుడంటుకు పోయిందో పైటకొంగు మండుతున్న బర్నరుకు తగిలి. అసలే కట్టినది టెర్లీన్.చీరెమో ఒక్కసారి అంటుకుంది. స్పృహ తప్పిపోయిన రాధకి విషయం ఎలా తెలుస్తుంది. జుత్తు కాలుతున్న వాసనకి పక్కరూములో ఉన్న అటెండర్స్ పరిగెత్తుకుని వచ్చారు. అక్కడ దృశ్యం చూసేసరికి నిలువునా కంపరం పుట్టుకు వచ్చింది. అందులో ఒకడు పరిగెట్టాడు ప్రిన్సిపాలుకు చెప్పడానికి. అందరూ చేరేసరికి అంతా అయిపోయింది. నెత్తిమీద వెంట్రుకలు మాత్రం మండుతున్నాయి గుళ్లో దీపంలా. అక్కడ దృశ్యం చూసేసరికి కళ్లనీళ్లు పెట్టనివాళ్లు లేరు. ఆశల వలయాలలో చిక్కుకున్న రాధ అగ్నికి ఆహుతై కొనఊపిరితో మిగిలింది. ఆంబులెన్స్ రప్పించి హాస్పిటల్లో చేర్పించారు. సురేష్‌కి టెలిగ్రాం ఇచ్చారు. కాని, అతను వచ్చేసరికి అంతా అయిపోయింది. రాధ ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది.

సురేష్ గుండెలదిరిపోయేలా ఏడ్చాడు. చెయ్యవలసినదంతా పూర్తి చేసుకొని రాధ సామాను తీసుకొని, బరువెక్కిన గుండెలతో ఇల్లు చేరేడు సురేష్.

ఆఫీసుకి నెల్నాళ్లు సెలవు పెట్టేశాడు. తన కళ్లెదురే రెండు ఘోరాలు జరిగిపోయాయి. అవి మరువలేనివి. అతి విచారకరమైనవి ఆ సంఘటనలు. తలుచుకొన్నప్పుడల్లా పిచ్చెత్తినట్టైపోయేవాడు. ప్రాణప్రదంగా పెంచుకున్న ఒక్కగానొక్క చెల్లెలు వెళ్లిపోయింది. తల్లీదండ్రీ వారి మానాన్న వారు వెళ్లిపోయారు. ఇక మిగిలింది తనొక్కడే. వికలమైపోయిం దతని మనసు. ఎప్పుడూ రాధే అతని కళ్లకు కట్టినట్టుండి, మరీ పిచ్చెత్తిపోయేవాడు. అట్టే ఆలోచనలతో సతమతమైపోతున్న సురేష్ రాధ పుస్తకాలు తిరగెయ్యడం మొదలెట్టాడు. అందులో రాధ డైరీ కళ్లబడింది. ఆత్రతగా పేజీలు తిరగేశాడు. అందులో అతన్ని ఆకర్షించినవి మూడు మాత్రమే...

10—8—61

ఏమిటో ఈ జీవితం. ఆడదాని బ్రతుకు విషవలయం. ఆడదే ఆడదానికి శత్రువు. స్వాతంత్ర్యమో అని గోలపెట్టి సంపాదించిన స్వాతంత్ర్యాన్ని సద్వినియోగపరచుకోలేక పోయింది. గృహిణిగానే రాణిస్తుంది గాని, మగాడిలా తిరగాలని ప్రయత్నిస్తే అవమానాలే తప్ప గౌరవం పొందలేదు.

16—8—61

ఎందుకో అందరి కళ్లూ నా మీదే ఉంటాయి. ఏమిటో ఆ వ్యాఖ్యానాలు! ఉద్యోగం చేసుకున్నంత మాత్రాన, పెళ్లి చేసుకోనంతమాత్రాన పతిత అనేనా అర్థం? ఈ వ్యాఖ్యానించేది హెచ్చు ఆడవారే! సాటి ఆడదాన్ని అలా అనడానికి వారికి నోరెలా వచ్చిందో? వ్యవస్థలో మార్పు వచ్చినా మనుష్యుల్లో మార్పు రాలేదు. ఆడవాళ్లలోని ఈ భావం పోవాలంటే ఏం చెయ్యాలి? అది మాత్రం సాధ్యం కాదు. కరుడుగట్టుకుపోయింది.

19—8—61

ఈ అవమానాల్ని నేను భరించలేను. ఎంత చదువుకున్నా నా ఆశయాలు తీర్చినట్టు లేదు. ఏదో వెలితి కనిపిస్తూనే ఉంది. దేనితో పరిపూర్ణత్వం వస్తుందో నాకు తెలియదు. జీవితంలో నేను పోగొట్టుకున్నదేదో అర్థం కాలేదు. నేను ఓడిపోయాను. అనవసరంగా ఇన్నాళ్లూ మాధవ్‌ని బాధపెట్టేను. రేపే రాసేస్తాను అన్నయ్యకి మా విషయం.

కన్నీటితో తల ఎత్తేసరికి రమ ఒక కవరు తెచ్చి ఇచ్చి వెళ్లిపోయింది. పరిచయమైన రాత చూసేసరికి ఆదుర్దాగా విప్పేడు కవరు

"అన్నయ్యా,

నిన్ననే నీ లెటర్ అందినది. వదిన మాటవిని రమకి పెళ్లి చేసెయ్, చదివించకు. పాపిష్టిదాన్ని అమ్మని ఎన్నాళ్లు బాధపెట్టాను, ఈ విషయంలో. ఆశ్చర్యపోతున్నావుకదూ — నేనా ఇలా వ్రాస్తున్నదని? ఔనన్నయ్యా — జీవితం వడ్డించిన విస్తరి కాదు. దాన్ని మనమే సరియైన దార్లో పెట్టుకోవాలి. చేతులు కాలేక ఆకులు పట్టి ప్రయోజనం లేదు. మన సమాజంలో ఆడదే సాటి ఆడదాన్ని గౌరవించలేదు. జీవితం నేర్పిన పాఠాల్లో మొదటిది ఇది. ఆడదానికి స్వాతంత్ర్యం ఉందికదా అని పైకివస్తే అవమానాలు పొందేది ఎక్కువభాగం ఆడవాళ్ల వల్లనే. నా కీ జీవితంమీద విసుగు వస్తూంది. అందుకే నీ కోరిక, ఇరవయ్యేళ్ళ నాటి అమ్మ కోరిక తీర్చబోతున్నాను. ముప్ఫైఏళ్ల కన్య పెళ్లికూతురు కాబోతూంది. వరుడు ఎవరో కాదు మా బావమరిది మాధవ్. పాపం. నా కోసమే ఇన్నాళ్లూ నిరీక్షించి ఉన్నాడతను. ఈ సంగతి మా కిద్దరికీ తప్ప మరెవ్వరికీ తెలియదు. వదినకు నా నమస్కారాలు.

రాధ."

చదివిన ఉత్తరం పై రెండు కన్నీటిబొట్లు రాల్చేడు సురేష్. ★